# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 12 నవంబర్ 2024




## ఈనెల 15న రాజంపేటలో అయ్యప్ప పడిపూజ

కార్తీక మాస పూజలు ప్రారంభం

**రాజంపేట అర్బన్, నవంబర్ 11, ప్రభాతవార్త:**

రాజంపేట పట్టణం జాతీయ రహదారిపై మణికంఠ నగర్‌లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు ప్రారంభం అయ్యాయి. అయ్యప్ప మండల పూజా మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఈనెల 15న కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శబరిమల ఆలయంలో మండల పూజా ప్రారంభోత్సవం సంధబ్భంగా రాజంపేట ఆలయంలో పడి మహోత్సవం పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ధర్మకర్తల మండలి అయ్యప్ప పడిపూజను కార్తీక పౌర్ణమి రోజున రాత్రి నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అయ్యప్ప శబరిమలలో ఎలా పడిపూజ నిర్వహిస్తారో అదేవిధంగా పవిత్ర పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాజంపేట, రైల్వే కోడూరు పరిసర ప్రాంతాల అయ్యప్ప భక్తులు పూడిపూజలలో పాల్గొనాలని ఆలయ ధర్మకర్తల మండలి కోరింది. అంతేకాకుండా రెండో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ గురుస్వామి సత్యనారాయణ తెలిపారు. ప్రతి రోజు తెల్లవారుజాము నుంచి ఉదయం 8గంటల వరకు ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం 6గంటల నుండి 9గంటల వరకు అయ్యప్ప భక్తులు భజన కార్యక్రమాలను నిర్వహిస్తారు. భజన అనంతరం ప్రతి రోజు రాత్రి అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటుచేస్తున్నట్లు ఆలయ చైర్మెన్ పాల ప్రకాష్ తెలిపారు. ఈనెల 27న ఆలయ వార్శికోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దఎత్తున గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ప్రకటించింది. ప్రతి రోజు స్వాములు అయ్యప్ప భజనలలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్య నాయుడు, చంద్రమౌళి, గురుస్వామి, నాగరాజు, ఆదినారాయణ, రమేష్ బాబు, వెంకట రెడ్డి, ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో పూజలు ఉత్సవాలు

**రాజంపేట,నవంబర్ 11,ప్రభాత వార్త :**



కార్తీక మాసం పురస్కరించుకొని రెండవ సోమవారం రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో ప్రజలు, వారి వారి ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు, కార్తీక మాస ఉత్సవాలను అట్టహాసంగా జరుపుకున్నారు. శివాలయాల్లో ప్రజలు, ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతూ అలంకరణతో పూజింపబడ్డాయి. సాయంత్రం శివాలయాల వద్ద కార్తీక మాస ఉత్సవాల అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, కోలాటాలు, భరతనాట్యాలు నిర్వహించారు.

# స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఆదినారాయణ రెడ్డి మనుషులమంటూ వ్యక్తుల హల్‌చల్ - అడ్డుకు టీడీపీ, స్థానిక నేతలు - పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయతీ



ఇరువర్గాలు రాళ్లతో ఘర్షణకు దిగుతున్న దృశ్యం



ఇరువర్గాలకు నచ్చచెబుతున్న పోలీసులు

**బద్వేలు, నవంబర్11 (ప్రభాతవార్త):**

బద్వేలులో స్థలాల విలువ కోట్ల రూపాయలు చేరుతుండడంతో వివాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఒక్క స్థలానికి ఎంతోమంది వ్యక్తులు పోటీపడి మాదంటే మాదని ఘర్షణకు దిగుతున్నారు. ఇదంతా రెవెన్యూ అధికారుల చేతివాటం వలనే ఈ వివాదాలు రోజురోజుకు ఘర్షణకు దారితీస్తున్నాయి. అధికారులు బదలీ అవుతూ మాముళ్ల తీసుకుని కొన్ని ఆధారాలతో అవతలవారికి ఆన్‌లైన్ చేయడంతో ఈరోజు ఈ వివాదాలకు కారణమవుతన్నాయి. మడకలవారిపల్లె పంచాయతీ సర్వేనెంబరు 809లో 5 ఎకరాల 20 సెంట్లు ఉండగా వీటిలో నూనె రాజేశ్వరి అనే మహిళ పేరుతో 2.50 ఎకరాలు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. అయితే రాజేశ్వరి మాకు అమ్మిందని వర్గాలుగా తయారై బద్వేలులో హల్‌చల్ చేస్తున్నారు. వాస్తవానికి సర్వేనెంబరు 809లో క్రయ విక్రయాలు జరపకూడదని వీటిలో డీకేటి స్థలం ఉందని, రిజిష్టర్ ఎలా అవుతుందని సంవత్సరం క్రితం బద్వేలులో ఆర్డీవోగా పనిచేసిన వెంకటరమణ ఈ స్థలంపై ఆంక్షలు పెట్టారు. నిన్నటివరకు ఈ స్థలాల జోలికి గాని, అటువైపు కూడా చూసిన వారు లేరు. ఈ రోజు ఆర్డీవో వెంకటరమణ బదిలీ అయిన అనంతరం అనేక ధృవపత్రాలను సృష్టించుకుని ఒక్కొక్కరుగా స్థలంపై హక్కును సాధించుకునే దిశగా అడుగులు వేస్తుండడంతో ఘర్షణలు జరుగుతున్నాయి. జమ్మలమడుగుకు చెందిన ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన మనుషులమని ఒకవర్గానికి చెందిన సర్వేనెంబరు 809లో పిచ్చి మొక్కలు పీకేందుకు జేసీబీని తీసుకువచ్చారు. దాదాపు 100 మంది మనుషులతో జేసీబీతో పనిచేస్తుండగా స్థానికంగా ఉండే టీడీపీ నేతలు, ఆ స్థలాన్ని కొనుగోలు చేసిన లబ్దిదారులు అడ్డుతగిలారు. మాకు ఈ స్థలం దాదాపు 15 సంవత్సరాల క్రితం రిజిష్టర్ అయ్యిందని, ఒక్కొక్కరు వారి శక్తి మేరకు ప్లాట్లు కొనుగోలు చేసి రిజిష్టర్ చేయించుకున్నామన్నారు. వీటిలో రెండున్నర ఎకరా నూనె రాజేశ్వరి మాకు విక్రయించిందని, ఆధారాలు మా వద్ద ఉన్నాయని, ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన వ్యక్తులు స్థానికుల మధ్య వివాదం చెలరేగింది. మాటమాటా పెరిగి జేసీబీని పనిచేయకుండా అడ్డుకోవడమేకాకుండా వివాదం ఘర్షణకు దారితీసింది. ఒకరినొకరు తోసుకుంటూ రాళ్లు తీసుకుని నీదెంత, నాదెంత అన్న స్థాయికి వివాదం చేరడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పోలీసుల సమక్షంలో కూడా ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు లాఠీఛార్జి చేసి అందరినీ తరిమికొటారు. మీకు ఏ ఆధారాలు ఉన్నా స్టేషన్‌కు వచ్చి తేల్చుకోవాలని ఇరువర్గాలకు నచ్చచెప్పారు. అనంతరం ఈ వివాదం పోలీసుస్టేషన్‌కు చేరింది. ఇరువర్గాలు వారికి ఉన్న ఆధారాలను పోలీసులకు చూపించడమేకాకుండా వారి బలాన్ని నిరూపించుకునేందుకు వారి నాయకుల చేత పోలీసులకు ఫోన్లు చేయించారు. ప్రస్తుతానికి ఈ స్థలంలో ఎవరేగాని వెళ్లకూడదని, రెవెన్యూరికార్డుల ప్రకారం పరిశీలించాక వారు మాత్రమే హక్కుదారులు అవుతారని అంతవరకు ఈ సమస్యను పెద్దది చేయకుండా వెళ్లిపోవాలని రూరల్ సీఐ నాగభూషణం ఇరువురికి సర్ది చెప్పారు. ఆదినారాయణ రెడ్డి మనుషులు అని చెప్పుకుని వచ్చిన వారి డేటాను పోలీసులు నమోదు చేశారు. ఎంతమంది వ్యక్తులు వచ్చారో వారి పేర్లు అన్ని రాసుకుని స్థానికంగా ఫిర్యాదు చేసిన వారి వివరాలు తీసుకుని ఎలాంటి గొడవలు జరగకుండా ఇద్దరికి నచ్చచెప్పారు.

## పదవి భార్యది..పెత్తనం భర్తది

**బద్వేలు ,నవంబర్11 (ప్రభాతవార్త):**



మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం భర్త పెత్తనం హల్‌చల్ చేస్తోంది. మండల పరిషత్ అధ్యక్షురాలిగా రమణమ్మ విధులు నిర్వహిస్తున్న ఆమె స్థానంలో భర్త రామసుబ్బారెడ్డి తనదే పెత్తనం అన్నట్లు సోమవారం మధ్యాహ్నం కార్యాలయ ఆవరణలో ఆదమరిచి నిద్రపోయారు. ఎంపీపీ విధులకు రాకపోయినా భర్త మాత్రం యదావిధిగా పెత్తనం చెలాయిస్తూ అధికారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది సోమవారం ఎంపీపీ సీట్లో కూర్చుని నిద్రపోతుండగా ఫోటో తీయడం అసలు విషయం బయటపడింది. ఇన్ని రోజులు పెత్తనమంతా ఎంపీపీదే అనుకుంటున్న ప్రజలకు నేడు ఈ ఫోటోను చూసి అసలు విషయం అర్థమైంది. కార్యాలయ ఉద్యోగులు ఈయన ఆహార్యాన్ని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డితో పాటు మరో ఇద్దరు అరెస్ట్

- అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి పాత్రపై ఆరా
- మరో 40 మందికి పైగా ఈ వ్యవహారంలో ఉన్నట్లు సమాచారం
- త్వరలో అందరి పాత్రపై విచారించి చర్యలు తీసుకుంటాం
- కర్నూలు డీఐజీ డా.కోయా ప్రవీణ్



**కడప క్రైం, నవంబరు 11, ప్రభాతవార్త:**

సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డితో పాటు అతనికి ఆశ్రయం కల్పించిన సుబ్బారెడ్డి, ఉదయ్ అనే మరో ఇద్దరిని అరెస్టు కర్నూలు రేంజి డీఐజీ డా.కోయా ప్రవీణ్ తెలిపారు. సోమవారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మీడియాకు వివరాలు వెల్లడించారు. వర్రా రవీంద్రారెడ్డి వేముల మండలం కొండ్రెడ్డిపల్లెకు చెందిన వాడు. ఇతను గత ఆరేడు సంవత్సరాలుగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా ద్వారా వైసీపీకి వ్యతిరేకులైన వివిధ పార్టీ నాయకులపై, మహిళలపై అపద్దపు, అస్లీల మార్ఫింగ్ ఫొటోల కంటెంట్ పెట్టి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరించేవాడన్నారు. గతంలో భారతి సిమెంటులో 2012లో ఉద్యోగంలో చేరి 2019లో అక్కడ ఉద్యోగం మానేసి 2019 నుంచి వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నారన్నారు. ఈ అసభ్యకర పోస్టులు పెట్టడం వలన వివిధ కులాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నాడన్నారు. కొందరు ప్రముఖులు వ్యవస్థగా ఏర్పడి అసాంఘిక శక్తులతో పనిచేస్తూ ధన సాయం చేస్తూ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 8న పులివెందుల అర్బన్ పీఎస్‌లో ఎస్సీ వర్గానికి చెందిన మల్లప్పగారి హరి సింహాద్రిపురానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నెం 409/2024 సెక్షన్ 386, 196, 351(3), 353(1) సి, 112(2), బి రెడ్ విత్ బి(5), 2023, సెక్షన్ 31 ఆర్ఎస్ 3, క్లాస్2, (వి), విఎ ఎస్సీ ఎస్టీ చట్టం 2015 67 ఐటీ చట్టాల కింద ఇన్‌ఛార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందని అందులో భాగంగా డీఎస్పీ ఉత్తర్వుల మేరకు ఈ కేసులో ముద్దాయి అయిన వర్రా ఆచూకి కోసం గాలిస్తుండగా ప్రకాశం జిల్లాలోని కుంట, ఆత్మకూరుకు వెళ్లే దారిలో ఆదివారం జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప బృందం వాహనాల తనిఖీలో రవీంద్రారెడ్డి అతనికి ఆశ్రయం కల్పించిన కమలాపురం మండలం నల్లింగాయపల్లెకు చెందిన సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల సున్నపురాళ్లమిట్టకు చెందిన ఉదయ్‌కుమార్‌రెడ్డిలను వారు ప్రయాణిస్తున్న కారుతో పాటు అరెస్టు చేయడం జరిగిందన్నారు. విచారణ నిమిత్తం సి.కె.దిన్నె పీఎస్‌లో హాజరు పరచగా డీఎస్పీ ముద్దాయిలను విచారించి వారి ఒప్పుదల స్టేట్‌మెంట్‌ను నమోదు చేశామన్నారు. ఈ ఒప్పుదల స్టేట్‌మెంట్‌లో రవీంద్రారెడ్డి కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి సూచనల మేరకు వైఎస్.షర్మిల, విజయమ్మ, సునీతలపై కూడా అసభ్యకర పోస్టులు పెట్టినట్లు ఒప్పుకున్నట్లు డీఐజీ తెలిపారు. అవినాష్‌రెడ్డి తన పీఏ రాఘవరెడ్డికి ఈ అసభ్యకర పోస్టులపై డిక్టేషన్ చేస్తుండగా తాను 2 పర్యాయాలు తాను చూసినట్లు రవీంద్రరెడ్డి ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఈ ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి తదుపరి విచారణ నిమిత్తం కష్టడీలోకి తీసుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## గొర్రెల కాపరులకు న్యాయం చేయండి మేడం..!

- సమస్య పరిష్కార వేదికలో గొర్రెల కాపరుల వినతి
- సోలార్ అధికారుల వైఖరిపై ఆర్డీవోకు ఫిర్యాదు
- పేదల నోటికాడ ముద్దను లాగివేయవద్దని వేడుకోలు

**జమ్మలమడుగు, నవంబరు 11, ప్రభాతవార్త:**



మా తండ్రి తాతల కాలం నుంచి గొర్రెల పోషణే జీవనాధారంగా కాలం వెల్లదీస్తున్నాం. మా ఊరి దగ్గరలో ఉన్న కొండపై మూగజీవాలను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. వందల కుటుంబాలకు జీవనాధారమైన కొండను ఇప్పుడు సోలార్ పరం చేశారు. పగలంతా గొర్రెలను ఎక్కడో ఓ చోట మేపుకొని రాత్రి వాటిని పడుకోబెట్టుకోవడానికి కొండలో ఓ మూలన కొంత స్థలాన్ని వదిలిపెట్టమని బతిమాలుతున్నా సోలార్ అధికారులు వినడం లేదు. ముళ్ల కంపతో చుట్టూ కంచెను ఏర్పాటు చేసుకొని రాత్రి గొర్రెలను అందులో పడుకోబెట్టుకుంటున్నాం. ఇప్పుడు ఆ ముళ్ల కంచెలను సైతం తొలగిస్తామంటూ సోలార్ అధికారులు బెదిరిస్తున్నారు. ఉన్న ఫలంగా మమ్మల్ని, మా మాగజీవాలను కొండ నుంచి తరిమేస్తే మాకు జీవనాధారం ఎలా మేడం? తరతరాలుగా వస్తున్న కులవృత్తిని వదులుకొని మా కుటుంబాలు రోడ్డున పడాల్సిందేనా? పేదలమైన మాకు న్యాయం చేయండి మేడం అంటూ గొర్రెల కాపరులు జమ్మలమడుగు ఆర్డీవోను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.

## ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

**రాయచోటి, నవంబరు 11, ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కార వేధిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. దరఖాస్తుదారులతో మాట్లాడాలి, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. ఇందుకు నిర్దిష్ట కాల పరమితి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఒక వేళ కోర్టు పరిదిలో ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకోవడం చేయాలి. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలి. పెండింగ్ దరఖాస్తులు రీ ఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

## చదువుతోపాటు క్రమశిక్షణ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు

**ప్రొద్దుటూరు నవంబర్ 11 ప్రభాతవార్త**



చదువుతోపాటు క్రమశిక్షణ కలిగి ఉంటేనే ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. సోమవారం స్థానిక దస్తగిరి పేటలోని తక్వా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో డాక్టర్ మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గౌస్ లాజం అధ్యక్షతన జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు అబుల్ కలాం మొహిద్దీన్ అని తెలిపారు నాటి స్వాతంత్ర సమరంలో మహాత్మా గాంధీ నెహ్రూ లతోపాటు పోరాటం చేశారన్నారు దేశంలో మొదటి విద్యా శాఖ మంత్రిగా 11 ఏళ్లపాటు పనిచేసి విద్యా విధానంలో సమూలమైన మార్పులు తెచ్చారని ఆయన కొనియాడారు. డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో మేధా సంపత్తి కల మోలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. రెండవ పట్టణ సిఐ యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ఉండాలన్నారు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని తెలిపారు అలాగే సమాజం పట్ల సమాజంలో జరుగుతున్న అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన డాక్టర్ మోలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి ఎంతో సేవ చేశారని అలాంటి వ్యక్తి జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్య దినోత్సవం గా ప్రకటించిందని తెలిపారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు ప్రోత్సాహక బహు మతులు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ షాకీర్ ఖురేషి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట సమరయోధులు మొట్టమొదటి దేశ విద్యాశాఖ మంత్రి డాక్టర్ మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవానికి పాల్గొన్న ముఖ్య అతిథులకు విశిష్ట అతిధులకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు మా పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## తోడుకో.. పోసుకో.. అమ్ముకో

**రాయచోటి, నవంబరు 11, ప్రభాతవార్త:**

ప్రభుత్వం ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని చెప్పడంతో ఇసుకను సమీప మండలాల నుంచి రాయచోటి తదితర ప్రాంతాలకు తరలించి జేబులు నింపుకుంటున్నారంటూ మండలంలోని రైతులు ప్రజలు వాపోతున్నారు. ఇష్టం వచ్చినట్లు తోడుకో, పోసఉకో, అమ్ముకో అంటూ రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ట్రిప్పు ఇసుకను అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసుల నిఘూ కొరవడడంతోనే అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్నారని పలువురు మేధావులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు శ్రావణిని వివరణ కోరగా ప్రభుత్వ ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చని చెప్పారనీ కానీ ఇసుక ఎత్తేచోట మిషన్లను ఉపయోగించరాదని అంతేకాకుండా రాత్రివేళల్లో ఇసుకను తరలించరాదని సమాధానం ఇచ్చారు. కానీ మండలాల నుంచి రాయచోటికి తరలిస్తున్న ఇసుక విషయం తమకు తెలియదని సమాధానమిచ్చారు.

## పిల్లల సంరక్షణ ప్రతి తల్లి బాధ్యత

**పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్తః**



పిల్లల సంరక్షణ ప్రతి తల్లితోనే సాధ్యమని తలపుల పీహెచ్‌సీ వైద్యులు చంద్రశేఖర్ తల్లులకు సూచించారు. సోమవారం ముదుపులవేముల పంచాయతీ దిగువ ఎల్లంపల్లె గ్రామంలో శిశువులను పరీక్షించి తల్లులకు సూచనలు సలహాలు ఇచ్చారు. శిశువు సర్వతోముఖాభివద్ధి సాధించాలంటే ఆరు నెలల వరకు తల్లిపాలతోపాటు నిర్దేశించి ప్రత్యేక ఆరోగ్యసేవలు అవసరమని ఇది తల్లితో పాటు కుటుంబ సభ్యులు బాధ్యతఅని వైద్యులు సూచించారు. పిల్లలకి వ్యాధి నిరోధక టీకాలు, ఆరు నెలల వరకు కమ్మని అమ్మపాలు, పరిసరాల పరిశుభ్రత, వ్యాధిగ్రస్తుల నుంచి చిన్నారులను దూరంగా ఉంచడం, పొగ, చలి, నుంచి పూర్తి రక్షణ కల్పించాలని అందుకు తల్లి, కుటుంబ సభ్యులు పూర్తి బాధ్యత తీసుకోవాలని చంద్రశేఖర్ తల్లులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎమ్, వసుందర, ఆశ కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ వారిచే వ్యాసరచన, ఎలక్యూషన్, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు

**పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్తః**



బాలల దినోత్సవం సందర్భంగా పీలేరు లయన్స్ క్లబ్ వారు పట్టణ పరిధిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఎలక్యూషన్, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో 18 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలలో ఎస్ఎండీ ఆఫ్సాన్(ఇండియన్ బీచ్ స్కూల్) ప్రథమస్థానం, సి.గిరీషా(వీఎస్ఎన్ సిద్దార్థస్కూల్) ద్వితీయస్థానం, జి.సాద్విక్(శ్రీకాకతీయ పాఠశాల) తతీయ స్థానంలో గెలుపొందారు. ప్రసంగం పోటీలలో ఎన్.చేనేత(ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల) ప్రథమస్థానం, పి.సన(శ్రీకాకతీయ స్కూల్)ద్వితీయస్థానం, ఎ.చరణ్‌కుమార్ (వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాల) తతీయ స్థానంలో గెలుపొందారు.డ్రాయింగ్ పోటీలలో చాందినీరావత్(ఏవీఆర్ స్కూల్) ప్రథమస్థానం, పి.శశికళ(డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల)ద్వితీయస్థానం, సి.తౌసిక్ (శ్రీభువన విద్యాలయం) తతీయ స్థానంలో గెలుపొందారు.క్విజ్ పోటీలలో ప్రథమస్థానం వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాల, ద్వితీయస్థానం జడ్పీహెచ్ఎస్ ఉర్దూ, తతీయస్థానం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు సుమారు రూ.15వేలు నగదు బహుమతితో పాటు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వీఎస్ఎన్ ప్రసాద్, ప్రెసిడెంట్ మహేష్‌గుప్తా, సెక్రటరీ చింతల విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి చెంగయ్య, సుధాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, శశిధర్‌రెడ్డి, అమర్నాధరెడ్డి, సూర్యనారాయణ, ప్రభాకర్‌రావు, మహేష్, అశోక్‌కుమార్, లయన్స్ మెంబర్లు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీల అభివద్ధికి ప్రాధాన్యం

**పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్తః**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ,ఎస్టీల అభివద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించారని జిల్లా విజిలెన్స్ మరియు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి హర్షం వ్యక్తం చేశారు.

## భూ ఆక్రమణలపై విచారణ జరిపించండి

**పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్తః**



పీలేరు మండలం బోదుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలో వైఎస్సార్ పార్టీ హయాంలో జరిగినభూ ఆక్రమణలపై విచారణ జరపాలని దళిత బహుజన విద్యార్థి సంఘం నాయకులు బద్దె భాను ప్రకాష్ డిమాండు చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి కి వినతిపత్రం అందజేశారు. జగనన్న కాలనీలు పేరుతో రూ.కోట్లు విలువైన భూములను కొందరు ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన భూ ఆక్రమణలతో పాటు జగనన్న కాలనీల పేరుతోఇచ్చిన పట్టాలపై విచారణ జరిపి ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఇదే విషయమై స్పందించిన కలెక్టర్‌పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావును విచారణకు ఆదేశించారు.

## భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర స్వామి నోములు

**పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్తః**



స్థానిక కోనేటి వీధిలో వెలసిన శ్రీలక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని సోమవారం మహిళలు సామూహిక కేదారేశ్వరస్వామి నోములు నోచుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభించి స్వామివారికి పంచామతాభిషేకం, బిల్వార్చ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణలో ముస్తాబైన కేదారేశ్వరస్వామి వారు మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆస్థాన మండపంలో అధిరోహింపచేశారు.ఆస్థాన మండపంలో సామూహికంగా మహిళలు కేదారేశ్వర నోములు నోచుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు శీనాస్వామి కేదారేశ్వర వ్రత విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అర్చకుల గోనవరపు శీనాస్వామి, భక్తులు మహిళలు అధికసంఖ్యలోపాల్గొన్నారు.

## పౌష్టికాహార పథకాలను సద్వినియోగం చేసుకోండి



పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ అన్నారు. సోమవాం స్థానిక కార్యాలయంలో ఆయాలతో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 0-5 సంవత్సరాల పిల్లలను ప్రీ స్కూల్‌కు రప్పించే బాధ్యత ఆయాలదేనన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని మెనూ ప్రకారం వంట వండి పిల్లలకు పెట్టాలని సూచించారు. ప్రతిరోజు పిల్లలకు ఎత్తు, బరువు కొలతలు నమోదు చేయాలని ఆయాలకు సూచించారు. అనంతరం కొలతల, బరువు పరికరాలను ఆయాలకు అందజేశారు. సూపర్‌వైజర్లు ఆయాలు పాల్గొన్నారు.

## ఓం నమశ్శివాయ



పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్త:

కార్తీక మాసం సందర్భంగారెండవ సోమవారం పీలేరులోని శ్రీకాశీవిశ్వేరస్వామి ఆలయంలో ఓం నమశ్శివాయ అనే శివనామస్మరణలతో మారుమ్రోగింది. వేకువజామున పెద్దఎత్తునమహిళా భక్తులు ఆలయానికి చేరుకున్నారు,. ఆలయ ప్రధాన అర్చకులు కుమారస్వామి స్వామి వారికి అభిషేకం, బిల్వార్చన విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మహిళా భక్తులు దర్శించుకుని కేదారేశ్వరి నోములు నోచుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రధాన అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఘనంగా మౌలానా అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు



పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్త:

భారత ప్రభుత్వ మాజీ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలను వాల్మీకిపురం లో సోమవారం ఘనంగా నిర్వహించారు. తెదేపా తెలుగు యువత అధ్యక్షులు చాను ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పాల్గొన్నముస్లీం సోదరులు కేకు కోసం సంబరాలు జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి విద్య పరంగా ఆయన చేసినసేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్ ముతవల్లీ అబ్దుల్ అజీమ్ సాదిక్, షబ్బీర్, మెకానిక్ చాను, ఖలందర్, యూసఫ్, కువైట్ బాబు, డిష్ బ్రదర్స్ జంషీద్, రియాజ్, కలిమా, ఫయాజ్, మురాషా, బాబు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేద్దాం



పీలేరు, నవంబరు 11 ప్రభాతవార్త:

మదనపల్లెలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సుకు మందకష్ణ మాదిగ ముఖ్య అతిదిగా రానున్న సందర్భంగా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీయస్ దుద్దు రామకష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా నియోజకవర్గ మండల కేంద్రంలో చరణ్‌కుమార్, బండ్లవంక పీవీ.రమణ, వెంకటాచలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసమావేశానికి ముఖ్య అతిధిలుగా హాజరైన ఎమ్మార్పీయస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకష్ణ మాదిగ విశిష్ట అతిథులుగా ఎమ్మార్పీయస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్‌లు హాజరైనారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అభినవ అంబేద్కర్ మహాజన నేత మందకష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా మాదిగ ఉపకులాల ఉజ్వల భవిష్యత్‌కై సమాజంలోని పేద వర్గాల సంక్షేమానికై అనేక రకాల మిలిటెంట్ ఉద్యమాలు చేసి జాతి చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనలో గుడిసెల్లో నిద్రిస్తున్న ప్రతీ ప్రతి మాదిగ ఉపకులాల బిడ్డలను తట్టి లేపి ఢిల్లీలోని భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తలుపు తట్టి సామాజిక న్యాయం బలపడేవిధంగా ఎస్సీవర్గీకరణ చట్టబద్ధత రాష్ట్రాలు చేసుకునే హక్కు ఉందని స్పష్టం చేసిన తరువాత మొదటి సారిగా వస్తున్నందున మనమందరం కలిసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మానవ సేవయే మాధవ సేవ

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 11, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు వాసి మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు ఆయన సతీమణి మోరే పరిమళ కార్తీక సోమవారం సందర్భంగా అరుణాచలం నందు రమణ మహర్షి ఆశ్రమం సమీపంలో ఉండే యాచకులకు, వృద్ధులకు భోజనం పంచి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మోరె లక్ష్మణ్ రావుకి, కుటుంబ సభ్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## 14 నుండి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రొద్దుటూరు నవంబరు 11 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం బాల బాలికల గ్రంథాలయంలో ఈనెల 14 వ తేదీనుండి 20వ తేదీవరకు 5 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రం థాలయ లికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలల విద్యార్థులకు పద్యపఠనం, చిత్రలేఖనం, వ్యా సరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు ముగింపు వా రోత్సవాల్లో భాగంగా 20వ తేదీ బహుమతులు ప్రధానం చేస్తామని ఆ యన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను గ్రంథాల యంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

## మన్నూరు సీఐగా మహమ్మద్ అలీ

రాజంపేట అర్బన్, నవంబర్ 11, ప్రభాతవార్త:

రాజంపేట రూరల్ మండలం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా మహమ్మద్ అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామాంజనేయులు విఆర్‌కు బదిలీ చేస్తూ డిఐజి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మన్నూరు సీఐగా వీఆర్‌లో పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయిన మహమ్మద్ అలీ బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఐ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

## ఘనంగా 2వ కార్తీక సోమవారం వేడుకలు

సిద్దవటం, నవంబరు 11, ప్రభాతవార్త:



కార్తీక మాసం 2వ సోమవారం సందర్భంగా మండలంలోని నిత్య పూజేశ్వర కోన, కపర్తీశ్వర కోన, సిద్ధవటేశ్వర స్వామి, సిద్దేశ్వర స్వామి శివక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచే లయకారుడికి ప్రత్యేక పూజలు రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దఎత్తున ఆలయాలను సందర్శించి అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందించారు.

## రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, నవంబరు 11, ప్రభాతవార్త:



మండలంలోని మాచుపల్లి రైతు సేవా కేంద్రాన్ని సోమవారం బద్వేలు వ్యవసాయ సంచాలకులు నాగరాజు ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలు సమీక్షించడం జరిగింది. అనంతరం రైతు రమణారెడ్డి ఉల్లిపంటలో బంగారు తీగ అనే కలుపు మొక్కను గమనించడం జరిగింది. పొలంలో పలు ఎరువుల తయారు తదితర సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చంద్రకళ, చిన్నక్క, రైతులు పాల్గొన్నారు.

## మత్తుకు యువత చిత్తు..

ఓబులవారిపల్లె, నవంబరు 11, ప్రభాతవార్త:

దేశానికి యువతే వెన్నముక యువత విద్యావంతులై ప్రయోజకులైతే భారత దేశమే ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉండడంతో పాటు అభివృద్ధి చెందే దిశగా పయనిస్తోంది. కానీ నేటి సమాజంలో మద్యానికి గంజాయి మత్తుకు యువత బానిసై చిత్తవుతోంది. అందువల్ల పోలీసు ఉన్నతాధికారులు సమాజ శ్రేయస్సు మార్పు తేవాలంటే ముఖ్యంగా పోలీసు పాత్ర క ఈలకంగా వ్యవహరించాలి. ఎప్పుడైతే పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటారు. గంజాయి విచ్చలవిడిగా మద్యం సేవించడం వంటి పనులు చేసే వారిపై పోలీసులు నిఘా ఉంచి అరికట్టాలని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిఘా ఉంచి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని పలువురు కోరుతున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తంబళ్లపల్లె, నవంబరు 11, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండల కేంద్రంలో సోమవారం మదనపల్లి సాయి సంజీవిని కిడ్నీ స్టోన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉదయం పాత జూనియర్ కాలేజీ ఆవరణంలో ప్రముఖ వైద్య నిపుణులు డా.మంజునాథ్, డా.సంజీవ్ తాన్సల్, డా.నాగరాజ్, డా.శ్వేతారెడ్డిలు రోగులకు కిడ్నీ సమస్యలు, తదితర సమస్యలపై ఉచితంగా మందులు పంపిణీ చేసి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో తంబళ్లపల్లె మండలంలోని పలు పంచాయతీల నుంచి పెద్దఎత్తున రోగులు హాజరై రక్త పరీక్షలు చేయించుకొని చికిత్సలతో పాటు ఉచిత మందులతో ఉపశమనం పొందారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో మదనపల్లి సాయి సంజీవిని ఆసుపత్రి నర్సులు, సిబ్బంది స్థానిక రోగులు పాల్గొన్నారు.

## కోసువారిపల్లెలో బ్రహ్మ కమలాల కార్తీక శోభ

తంబళ్లపల్లె, నవంబరు 11, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కార్తీక సోమవారం పురస్కరించుకొని స్థానిక కోళ్ల ఫారం శ్రీనివాసులరెడ్డి ఇంట బ్రహ్మ కమలాలు తమ ఇంట విరబూయడం తమ అదృష్టంగా భావించి ఆ కుటుంబంలో ఆనందానికి అవధులు లేవు. శ్రీనివాస్‌రెడ్డి ఇంట విరబూసిన బ్రహ్మ కమలాలు చూడడానికి కోసువారిపల్లెలోని ప్రజలు కట్టడం విశేషం.

### యువత మోలానా అబుల్ కలాం ఆజాద్ ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 11, ప్రభాత వార్త:

పట్టణంలోని మన ప్రజా సేవా సమితి కార్యాలయం నందు మోలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టూటౌన్ సిఐ యుగంధర్, మండల విద్యాధికారి సావిత్రమ్మ, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సాదు గోపాల్ కృష్ణ,అసిస్టెంట్ గవర్నర్ మల్లికార్జున, కేంద్ర సాహితి పురస్కార గ్రహీత చదువుల బాబు పాల్గొన్నారు. జాతీయవిద్యా దినోత్సవం సందర్భంగా సిఐ యుగంధర్ మాట్లాడుతూ యువత మోలానా అబుల్ కలాం ఆజాద్ ని ఆదర్శంగా తీసుకొని చదువు పై ఎక్కువ దృష్టి పెట్టి ఉపాధ్యాయుల బాధ్యత మరియు తల్లిదండ్రుల బాధ్యతలు పిల్లలపై ఎక్కువగా ఉన్నాయని పిల్లలను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలని వారిని దండించైనా మంచిదారిలో తేవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలు,రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు, ఉపాధ్యాయులకు "పది మందికి అబుల్ కలాం ఆజాద్ పురస్కార అవార్డు" అందజేశారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్,ఉపాధ్యక్షులు గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖలీద్, ట్రెజరర్ మెహమూద్,యువత కార్యదర్శి యూసుఫ్,పరాన్, మునయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో భక్తుల సందడి

దువ్వూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:



కార్తీక మాసంలో రెండవ సోమవారం అయినందున మండలంలోని వివిధ శివాలయాల్లో భక్తుల సందడి కనిపించింది. దువ్వూరుకు సమీపంలోని పాత దువ్వూరులో వెలసి ఉన్న శ్రీ భీమలింగేశ్వర ఆలయం నందు ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొని శివునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే కానగూడూరు, గుడిపాడు, దువ్వూరు-ప్రొద్దుటూరు క్రాస్ రోడ్డు వద్ద శివాలయంలో ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే శివాలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దువ్వూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారిలో జిల్లెల్ల గ్రామ సమీపాన జరిగిన రహదారి ప్రమాదంలో అల్లూరి నర్సింహులు(37) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లెల గ్రామానికి చెందిన అల్లూరి నర్సింహులు, అరవింద్ కుమార్, నర్సింహులు అనే ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై జిల్లెల్ల నుండి దువ్వూరుకు వచ్చి పనులు ముగించుకొని జిల్లెల్లకు వెళుతుండగా వెనుకవైపున నుంచి ఒక వాహణం గట్టిగా హారన్ కొట్టడంతో భయపడి అదుపు తప్పి మోటార్ సైకిల్ బోల్తా పడింది. దీంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్సనిమిత్తం 108 వాహణంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ అల్లూరి నర్సింహులు చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

## రేపు సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ

దువ్వూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో 13వ తేది బుధవారం మండలంలోని సర్పంచులకు ఎంపీటీసీలకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. వీరికి జీపీడీసీ, డీపీడీసీ అనే రెండు కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని వారి పరిధిలోని సర్పంచులను, ఎంపీటీలను కూడ హాజరయ్యే విధంగా చూడాలని ఎంపీడీఓ తెలిపారు.

## రాజంపేటలలో త్రాగునీటి సరఫరాకు అంతరాయం

రాజంపేట,నవంబర్ 11,ప్రభాత వార్త :



రాజంపేట పట్టణంలో గత రెండు రోజులుగా త్రాగునీటి సరఫరా నిలిచిపోయింది. త్రాగునీటి కోసం అన్నమయ్య ప్రాజెక్టు లోని పిల్టర్ ద్వారా వచ్చే త్రాగు నిటి కోసం నిర్మంచిన పైపు లైన్ టౌన్ కు చివరి బాగంలో పిఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద పగిలిపోయింది. పంట పొలాల్లోనుంచి తీసిన త్రాగునీటి పైపు లైను అక్కడ కొంత మంది ఇళ్ళ నిర్మాణాలు చేపట్టి పునాదులు తీయడంతో పైప్ లైన్ పగిలిందని దీంతో రెండు రోజుల పాటు పట్టణ ప్రజలకు త్రాగు నీరు అందవని మున్సిఫల్ వాటర్ సెక్షన్ సిబ్బంది కూడా తెలుపడం జరిగింది. వీలైనంత తొందరలో పైప్ లైన్ మరమ్మత్తులు చేసి త్రాగు నీరు అందజేస్తామని వారు తెలిపారు.

## ఎంపీ పీఏ రాఘవరెడ్డి, సోషియల్ మీడియా వివేక్‌పై కేసు నమోదు

- ఏపీ రాఘవరెడ్డి, వివేక్‌రెడ్డిల కోసం ముమ్మర గాలింపు చర్యలు
- 48 గంటల్లోగా అరెస్టు చేసేందుకు ప్రణాళికలు
- మరికొంతమందిపై కేసు నమోదు అయ్యే అవకాశం
- వరుస అరెస్టులపై హైకోర్టులో పిటిషన్ వేయనున్న ఎంపీ

పులివెందుల, నవంబరు 11, ప్రభాతవార్త :

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి, జిల్లా సోషియల్ మీడియా కన్వీనరు వివేకానందరెడ్డిలపై పులివెందుల పోలీసుస్టేషన్ నందు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో వీరిని అరెస్టు చేసేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలుగా ఏరపడి గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. సింహాద్రిపురం మండల కేంద్రంలో నివసించే పుల్లప్పగారి హరిని పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద దూషించారు అన్న ఫిర్యాదు మేరకు వరుసగా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే వర్రా రవీంద్రారెడ్డి, వైఎస్ కుటుంబ సమీప బంధువు అర్జు న్‌రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డిల మీద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే వర్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని, పులివెందుల నియోజకవర్గం లింగాల మండలానికి చెందిన వివేకానందరెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున ఆనరు. ఇప్పటికే ప్రత్యేక గ్రూపులుగా విడిపోయి దక్షిణాది రాష్ట్రా లన్నింటిలో జల్లెడ పడుతున్నారని సమాచారం. రాబోయే 48 గంటల్లోగా ఎంపీ పీఏ రాఘవరెడ్డిని, సోషియల్ మీడియా కన్వీనరు వివేకానందరెడ్డిని అ రెస్టు చేయాలని, లక్ష్యంగా పెట్టుకుని పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేసుకు న్నట్లు సమాచారం. వీరిపైనే కాకుండా మరికొంతమందిపైన కూడా కేసులు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మొత్తం సోషియల్ మీడియా ద్వారా వైఎస్ఆర్‌సీపీ తరపున యాక్టివ్‌గా పనిచేసిన వారందరిపైన కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

**- వరుస అరెస్టులపై హైకోర్టులో పిటిషన్ వేయనున్న ఎంపీ :** వైఎస్ఆర్‌సీపీకి చెందిన సోషియల్ మీడియా వారిపైన, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుగా వరుసగా కేసులు నమోదు చేసి వెంటపడి అరెస్టు చేసి చిత్రహింసలు పెడుతూ వైకాపా వారిని భయబ్రాంతులకు గురి చేస్తున్నారని, కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విజయవాడలోని రాష్ట్ర హైకోర్టులో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయనున్నారు. అరెస్టు అయిన వారికి బెయిలు మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ వేసే అవకాశాలు కూడా

## డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నది ఏపీజీబీనే

పులివెందుల, నవంబరు 11, ప్రభాతవార్త :



డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నది ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మాత్రమేనని ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. లింగాల మండలం ఇప్పట్లలో సోమవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు రూపే కార్డు సదుపాయం ఉందని, ఈ కార్డు ద్వారా రూ.లక్ష నుండి రూ.2లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ఉన్నాయన్నారు. ఏ బ్యాంకు ఖాతాదారుడైనా మా బ్యాంకు వ్యాపార ప్రతినిధి వద్ద ఆధార్‌కార్డుతో ఆర్థిక లావాదేవీలు జరుపుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఇలా ఎన్నో ఆకర్షణీయమైన పథకాలు ఉన్నాయన్నారు. ఖాతాదారుల శ్రేయస్సే తమ బ్యాంకు ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

### నాటుసారా నిర్మూలనకు ప్రజలందరు భాగస్వాములవ్వాలి

పులివెందుల రూరల్, నవంబరు 11, ప్రభాతవార్త :



నాటుసారా నిర్మూలనకు ప్రజలందరు భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనరు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని నగరిగుట్టలో సోమవారం నాటుసారా వలన కలిగే అనర్థాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. నాటుసారా రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు నజీర్ అహమ్మద్, ఎస్సై విష్ణునారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆజాద్ జయంతి వేడుకలు

పులివెందుల రూరల్, నవంబరు 11, ప్రభాతవార్త :

స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పులివెందులలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ వరప్రసాద్, కమీషనరు రాముడు, వైస్‌ఛైర్మన్ హాఫీజ్‌లు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**- వేంపల్లె :** మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 126వ జయంతి వేడుకలను సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆజాద్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తులసిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, ఆరుశేర్ల సుబ్బరాయుడు, వెంకటేష్, బద్రి, మదార్, తదితరులు పాల్గొన్నారు.



## అపార్ కష్టాలు తొలగించేందుకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయించండి

వేంపల్లె, నవంబరు 11, ప్రభాతవార్త :



అపార్‌కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో కష్టాలు తొలగించేందుకు వేంపల్లెలో ఆధార్ అప్‌డేషన్ కేంద్రం ఏర్పాటు చేయించాలని ఉర్దూ హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్, హైస్కూల్ ప్లస్ గర్ల్స్ ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాస్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కుళ్లాయమ్మను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. అడ్మిషన్ రిజిష్టరులో, యూడీఐస్‌లో, ఆధార్‌కార్డులలో కొందరు విద్యార్థుల పుట్టిన తేదీలలో తేడాలున్నాయన్నారు. దీంతో అపార్ నమోదులో పనులు ఆలస్యం అవుతున్నాయని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

## టీడీపీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు



వేంపల్లె, నవంబరు 11, ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీలో కష్టపడిని వారికి తగిన గుర్తింపు ఎల్లవేళలా ఉంటుందని టీడీపీ జిల్లా కార్యదర్శి ఎస్‌పి జయరామిరెడ్డి అన్నారు. వేంపల్లెలోని గండిరోడ్డులో సోమవారం నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై కూడా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. టీడీపీ సభ్యత్వాలను ప్రతి ఒక్కరు చేపట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆర్.వి.రమేష్, మల్లంగి మణిగోపాల్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, రెడ్డికిషోర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ తరం యువతకు ఆదర్శనీయం.. మోలానా అబుల్ కలాం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప, నవంబరు 11, ప్రభాతవార్త :

స్వాతంత్ర సమరయోధులు, భారత తొలి విద్యాశాఖ మంత్రి ఖీమోలానా అబుల్ కలాం ఆజాద్‌ఖీ అసమాన విద్యావేత్తతో పాటు గొప్ప పరిపాలకుడని, ఈ తరం యువతకు ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. సోమవారం కలెక్టరెట్ లోని ప్రజా ఫిర్యాదుల హాలులో మోలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం మరియు జాతీయ విద్యా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిధిగా హాజరవ్వగా.. ఆయనతో పాటు.. మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... స్వాతంత్ర సంగ్రామంలో గాంధీ, నెహ్రూలతో చురుగ్గా మోలానా అబుల్ కలాం పాల్గొన్నారని తెలిపారు. అరబిక్, పర్షియన్, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ఆయన నిష్ణాతులని పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్,అఖిల భారత విద్యా కౌన్సిల్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఢిల్లీ యూనివర్సిటీలను అబుల్ కలాం ఆజాద్ స్థాపించడం జరిగిందని గుర్తుచేసారు. భారత విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టినందుకు గాను స్వాతంత్ర భారత దేశంలో మొట్టమొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితులైనారు అన్నారు. అదేవిధంగా వీరి జయంతిని "జాతీయ విద్యా దినోత్సవం" గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని అన్నారు.1992లో దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న ను కూడా ప్రకటించారని ఇంతటి మహోన్నత వ్యక్తి యొక్క అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. మోలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను మంచి ఆశయాలతో పెంచాలన్నారు.పిల్లలే రేపటి తరం భవిష్యత్తని.. అందరూ బాగా చదువుకోవాలని, గొప్పవారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముందు మోలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి జిల్లా కలెక్టర్, ప్రముఖులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.జిల్లాలో విద్యలో ప్రతిభ చూపిన మైనార్టీ విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మేమెంటోలు, బహుమతులు అందజేశారు. మైనార్టీల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురు ప్రముఖులకు జిల్లా కలెక్టర్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్, ఆల్ మేవ చైర్మన్ ఫరూక్, మాజీ ఉర్దూ అకాడమి చైర్మన్ షేక్ జీలాన్,మఖ్దూమ్ బుకారి, సలావుద్దీన్, మన్సూర్ అలీ ఖాన్,సామ్యేలు,ఇతర మైనార్టీ నాయకులు, మన్సూర్ నాయకులు, మతపెద్దలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుండి రక్ష

కడప, నవంబర్ 11, ప్రభాతవార్త :

గౌరవనీయులైన డాక్టర్ చెరుకూరి శ్రీధర్ జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ కలెక్టర్ కార్యాలయంలోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు "ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుండి రక్ష కార్యక్రమంలో" భాగంగా విదిదీ 3.0 సర్వే 14112024 వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ప్రతి గృహమునందు నివసిస్తున్న 18 సంవత్సరములు పైబడిన స్త్రీ, పురుషులకు షుగరు, బి.పి, రక్త పరీక్ష మరియు నోరు, రొమ్ము, గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు ఉచితముగా నిర్వహిస్తున్నామని ప్రజలందరూ ఈ కార్యక్రమములో పాలు పంచుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఈనెల 14112024వ తేదీ నుండి . రాష్ట్రీయ బాల స్వా సీయ్య కార్యక్రమంలో" భాగంగా ప్రతి అంగన్వాడి సెంటర్ నందు మరియు ప్రతి ప్రభుత్వ పాఠశాలల నందు పిల్లలకు, విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. క్యాన్సర్ స్క్రీ నింగ్ పరీక్షల సర్వే కార్యక్రమమునకు సంబంధించిన గోడపత్రాలు (పోస్టర్స్) బ్యానర్స్ మరియు స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించిన హెల్త్ కార్డ్స్, పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇంచార్జి డిఆర్వో శ్రీనివాసులు, డిఎంహెచ్వో డాక్టర్ నాగరాజు, ఎన్‌సిడి నోడల్ ఆఫీసర్ డా. రమేష్, జడ్పి సీఈవో ఓబులమ్మ, డీఈవో, ఐ సిడి ఎస్ పిడి శ్రీలక్ష్మి, డిఆర్డీఏ పిడి ఆనంద్ నాయక్, డిసిహెచ్ఎస్ హిమదేవి, డిఎంవో తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డయాలసిస్ రోగులను 108 వాహనంలో తీసుకువెళ్లాలి

వేంపల్లె, నవంబరు 11, ప్రభాతవార్త :



డయాలసిస్ రోగులను 108 వాహనంలో ఆయా ఆసుపత్రులకు తరలించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. సోమవారం వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తనిఖీ చేశారు. మందులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అరవిందో ఫౌండేషన్ 108 వాహనాల్లో డయాలసిస్ రోగులను తరలించవద్దని ఆదేశాలు ఇవ్వడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, టీడీపీ నాయకులు రామచంద్ర, జనసేన నాయకులు సొక్కం మల్లికార్జున, మహేష్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.

### ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

ఉదయగిరి శ్రీనివాసులు, తండ్రి ఉదయగిరి రమణ, నివాసం: ఇంటి నెం. 1/1644, యర్రముకపల్లి, కందిపాళెం, వైఎస్ఆర్ జిల్లా నేను దస్తావేల జిరాక్స్ కోసం పుట్లంపల్లి ప్రాంతంలోని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్దకు వెలుతుండగా నా యొక్క సెటిల్మెంట్ ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావే నెం: 1453/2020. ఈ దస్తావేజు ఎవ్వరికైనా దొరికిన యడల క్రింది ఫోన్ నెంబరుకు గానీ, పై అడ్రసుగానీ తెలుపగలరు. తగిన పారితో షికం ఇవ్వబడును. ఫోన్ నెంబరు: 9676225254

# టిడిపి శ్రేణులు టిడిపి పార్టీ సభ్యత్వంలో...



**లక్కిరెడ్డిపల్లి నవంబర్ 11 ప్రభాతవార్త**

మండలం కస్తూరి రాజు గారి పల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రివర్యులు, రాంప్రసాద్ రెడ్డిమరియు వారి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారి సూచనల మేరకు లక్కిడి పల్లి మండలం యువ నాయకుడు యనమల మదనమోహన్ మరియు గ్రామ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. యనమల మదనమోహన్ మరియు గ్రామ నాయకులు ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వం వలన కలిగే ఉపయోగాలు వివరిస్తూ ప్రజల చేత స్వచ్ఛందంగా సభ్యత్వ చేపించారు. మదన్ మోహన్ మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేనంత బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. వంద రూపాయలతో పార్టీ సభ్యత్వం తీసుకొని ఐదు లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చునని సభ్యత్వం తీసుకుంటే తెలుగుదేశం పార్టీ సమస్యలు ఉన్నప్పుడు ఎల్లవేళలాఅండగా ఉంటాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ దేవేంద్ర రెడ్డి, పాపయ్య, సుధీర్, జనార్దన్ రెడ్డి, సిద్ధకవెంకటరామిరెడ్డి, యోగాంజనేయులు, బోనాల దన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేసిన తాసిల్దార్

**ముద్దనూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:**



కడప జిల్లా వ్యాప్తంగా ఆధార్ సెంటర్లలో అధిక మొత్తంలో ప్రజల నుంచి ఆధార్ నిర్వాకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశాల మేరకు ముద్దనూరు తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి సోమవారం నాడు ఉప్పులూరు గ్రామమునందు ఆధార్ సెంటర్ ను ఆకాస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్ సెంటర్ కు వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ ఆధార్ సెంటర్లో డబ్బులు ఎక్కువ డిమాండ్ చేస్తున్నారా అనే విషయాన్ని ప్రజల నుంచి అడగగా ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయలేదని తహశీల్దార్ కు తెలిపారు. ఒకవేళ ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సమస్యను పరిష్కరించాలని ఈవోకు వినతి పత్రం

**ముద్దనూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:**



ముద్దనూరు పట్టణంలోని బాల నారాయణ రెడ్డి హాస్పిటల్ సమీపము నుంచి బాయ్స్ హై స్కూల్ వరకు నీటి కుళాయిలు నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మేజర్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహులు సోమవారం నాడు గ్రామ ప్రజలు వినతి పత్రం ఇవ్వడం జరిగినది. వివరాల్లోకి వెళితే 15 రోజుల నుంచి నీటి కుళాయిలకు నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మరియు బాల నారాయణ రెడ్డి హాస్పిటల్ సమీపము నుంచి బాయ్స్ హై స్కూల్ వరకు నూతనంగా సిమెంటు రోడ్డు నిర్మాణంలో ఉండడంతో వాహనాలు ద్వారా నీరు తెచ్చుకోవాలన్న తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని, సమస్యను ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి ఇదే పరిస్థితి ఇలాంటి సమస్య ఎదురవుతుందని శాశ్వత పరిష్కారం చూపాలని ఈవోకు విన్నవించుకున్నారు. పంచాయతీ ఈవో మాట్లాడుతూ నీటి పైపు లైను లో చెట్లు వేర్లు పెరిగి అడ్డుపడడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వారంలోగా శాశ్వత పరిష్కారం చూపుతానని గ్రామ ప్రజలకు ఈవో తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పునరుద్దరనే ప్రాణం

**చిన్నమండెం, నవంబర్ 11, ప్రభాతవార్త:**



పర్యావరణ పరిరక్షణకు పునరుద్ధరనే ప్రాణమని ప్రధానోపాధ్యాయులు రెడ్డన్న అన్నారు. సోమవారం మల్లూరు జడ్పీ హై స్కూల్లో సూరజ్ కృష్ణ గ్రీనసరి వావ్ ఏజిఎస్ వారిచే నిర్వహించబడే రీసైక్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రెడ్డన్న మాట్లాడుతూ పుస్తకాలను తయారు చేయాలంటే చెట్లను నరికి వాటి కలప కాండంను ఉపయోగిస్తారని, చెట్లను నరికి వేయడం వలన పుస్తకాలు తయారవుతాయనే అవగాహన విద్యార్థులకు కల్పించారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే పుస్తకాల వ్యర్థపదార్థాలతో కలిపి వేయకుండా వాటిని జాగ్రత్తగా దాచి ఉంచి వాటి అవసరం తీరిన తర్వాత పాత పుస్తకాలను రీసైక్లింగ్ ఇవ్వడానికి తీసుక వస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు వారి వంతు బాధ్యతను సంపూర్ణంగా నెరవేర్చుకొని నేటి బాలలే రేపటి పౌరులుగా నిరూపించుకోవాలన్నారు. ఈ పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ రీసైక్లింగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఉపాధ్యాయ బృందం రెడ్డి ముని, సుధాకర్, వెంకట్రామయ్య, పిడి రామచంద్ర, ఐవి అసిస్టెంట్ శివయ్య, ఐటిసి ఏజీఎస్ వావ్, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలకపై శిక్షణ

**కురబలకోట, నవంబర్ 11 ప్రభాతవార్త :**



గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ గంగయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎస్‌ఎచ్ గ్రూపు లీడర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఈనెల 13న ఇదే అంశంపై ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిటిసిలు సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వే ఇప్పటి వరకు 65శాతం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండలంలో 14,227 గృహాలు ఉండగా ఇందులో 8756సర్వే అయినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ సర్వే చేయించుకోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు.

# అఘాయిత్యానికి యత్నించిన వ్యక్తికి దేహశుద్ది

**కురబలకోట, నవంబర్ 11 ప్రభాతవార్త :**



సైకో నరసింహారెడ్డి

చిన్నారులపై అఘాయిత్యానికి యత్నించిన వ్యక్తికి ప్రజలు దేహశుద్ధి చేసిన సంఘటన కురబలకోట మండలంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకొంది. గ్రామస్థుల కథనం మేరకు కురబలకోట మండలం ఎస్‌సి కాలనీలో పాఠశాల ఆవరణంలో ఆడుకొంటున్న చిన్నారులపై అఘాయిత్యానికి యత్నిస్తుండగా తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె గ్రామం కుక్కలవారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి గత వారం రోజులుగా ఆ గ్రామంలో సంచరిస్తున్నాడు. నరసింహారెడ్డికి మతిస్థిమితం లేదు. సోమవారం మద్యాహ్నం చిన్నారులు పాఠశాల బ్రేక్ సమయంలో బహిర్భూమికి వెళ్ళగా అఘాయిత్యానికి యత్నిస్తుండగా గ్రామస్థులు కనుగొని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటనపై ముదివేడు పోలీసులకు సమాచారం అందించడంతో ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

# మానవత్వనం చూపిన జనసేన నేత పోతుల సాయినాథ్

## సకాలంలో వైద్యం చేయించి ముగ్గురి ప్రాణాలు కాపాడిన వైనం



ఆసుపత్రిలో చేర్పించిన దృశ్యం

**ములకలచెరువు, నవంబర్ 11 ప్రభాతవార్త :**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను తంబళ్ళపల్లె జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యచికిత్స అందించి ముగ్గురి ప్రాణాలను కాపాడి మానవత్వం చాటుకొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిటిఎం మండలం, బూర్లపల్లె పంచాయితీ కొత్తపల్లె వాసులు మునిరాజ్, లక్ష్మన్న, నీరజలు బైక్‌లో సొంత పనులు నిమిత్తం వేపూరికోటకు వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు వారు వెలుతున్న ద్విచక్రవాహనాన్ని మరో వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో వెలుతున్న వీరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఆటుగా వెలుతున్న జనసేన తంబళ్ళపల్లె ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ సంఘటనను గమనించి ప్రమాదంలో గాయపడిన వారిని సొంత వాహనంలో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. క్షతగాత్రులను సమయస్ఫూర్తితో అసుపత్రికి తరలించి వైద్యం అందించేందుకు సహకరించి మానవత్వాన్ని చాటుకొన్న సాయినాథ్‌ను పలువురు అభినందించారు.

# త్రీడీడీన్ మోడలింగ్‌పై శిక్షణా తరగతులు

**కురబలకోట, నవంబర్ 11 ప్రభాతవార్త :**

త్రీడి డీన్ మోడలింగ్ న్యాసింగ్ ఎడిట్ హ్యాండ్ మేనేజ్ అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మిట్స్ కళాశాలకుచెందిన సివిల్ ఇంజనీరింగ్ విభాగం వారు ఐఎస్‌టిఈ స్టూడెట్స్ చాప్టర్ వారి సహకారంతో ఆరు రోజులు పాటు ఈ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి డాక్టర్ పి.కిషోర్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో తాజా పద్దతులు, ప్రమాణాలపై అధ్యాపకులు, విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. అందుకు త్రిడి మోడలింగ్ సాఫ్ట్‌వేర్ దోహదపడుతుందని తెలిపారు. సివిల్‌ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేరు ఉద్యోగ అవకాశాలకు దోహద కల్పిస్తుందన్నారు.

# పీలేరు బస్సు సమయానికి రాలేదని స్పందనలో ఫిర్యాదు

**సుండుపల్లి, నవంబర్ 11, ప్రభాతవార్త:**

పీలేరు నుండి పించా వరకు నడుస్తున్న పీలేరు డిపో ఆర్.టి.సి. బస్సులు టైముకు సక్రమముగా రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతము పల్లెలమీదిగా 2 బస్సులు నడుస్తున్నాయి. అని కూడా టైముకు రాక చుట్టుప్రక్కల వున్న రైతులు కూరగాయలు వారాంతర సంతలకు, విద్యార్థులు పాఠశాలకు పోవడానికి చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పల్లెవాసులకు ఆరోగ్యసమస్యలు వచ్చినప్పుడు ఆసుపత్రికి వెళ్ళడానికి బస్సులు లేక చాలా ఇబ్బంది పడుకున్నారు. ఆదివారం వచ్చిందంటే పూర్తిగా డిపో నుండి బసులు రావడంలేదు. ఇప్పుడు వస్తున్న బస్సులను పీలేరు వల్లెలు మీదిగా పించాకు వచ్చి తరువాత సుండుపల్లె వరకు నడిపిస్తే ఇంకా ప్రజలకు సౌకర్యంగా వుంటుంది మరియు బస్సు కలెక్షన్ కూడా బాగా వచ్చే అవకాశము వుంది. కనుక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బస్సులను ఈ రూట్ల మీదిగా నడుపుటకు సహకరించవలసినదిగా సుండుపల్లె మండలం ప్రజలు తెలుపుతున్నారు. ఇదే విషయమై వారు స్పందనలు ఫిర్యాదు చేసినట్లుగా కూడా తెలుస్తోంది.

# పెంచిన కరెంటు చార్జీలు ఉపసంహరించుకోవాలి



**రైల్వేకోడూర్ అర్బన్, నవంబర్ 11, ప్రభాతవార్త:**

పెంచిన కరెంటు చార్జీలు వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని రైల్వే కోడూరు కాంగ్రెస్ ఇంచార్జ్ గోసాల దేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె కోడూరు సివిల్ ఇంజనీరింగ్ కరెంట్ ఆఫీస్ నందు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎన్ శాంతయ్య ఆధ్వర్యంలో పెంచిన కరెంటు చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు .ఈ సందర్భముగా నియోజకవర్గ ఇన్చార్జి.గోశాల దేవి రాష్ట్ర నాయకులు ఎన్ శాంతయ్య మాట్లాడుతూ చార్జీలు పేరుతో పెరిగిన కరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు అంధకారములో బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇక ప్రతి ఒక్కరూ లాంతర్లు కొనుక్కోవాల్సిందే అని. వైసిపి హయాములో రూ. 35వేల కోట్లు సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజల నుంచి వసూలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా 5. నెలల్లోనే రూ. 17వేల కోట్ల భారం మోపుతుంది. అందుకే వైసిపికి .కూటమి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదు. ఇది వైసీపీ చేసిన పాపమే అన్నారు. 4. రూపాయలు పడే యూనిట్ ధర 8. ఎనిమిది రూపాయలు పెట్టారు అక్రమంగా హిందూ జాల లాంటి కంపెనీలకు చెల్లించారంట తప్పు జగన్ చేస్తే ఎలాప్రజలు పై ఆ భారం మోపడం ఎందుకు ప్రజలు ఆ భారాన్ని ఎందుకు చెల్లించాలి ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలు ఎక్కువగా ఉన్నాయని పక్క రాష్ట్రంలో తెలంగాణలో రూ.4. 80 పైసలు యూనిట్ ధర ఉంటే. ఏపీలో మాత్రము 6. రూపాయలు వసూలు చేస్తున్నారనీ కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండలం నాయకులు సిగమాల రమేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు రవి రైల్వే కోడూరు నియోజకవర్గ విద్యార్థి నాయకులు సిగమాల శివ, బొమ్మి రాజేష్, కోడూరు నాయకులు ఉప్పుటూరు బ్రహ్మయ్య, ఆదిలక్ష్మి, చరణ్, పెంచలయ్య, కళ్యాణ్, జగదీష్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

## యుటియఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్



**బద్వేల్ అర్బన్ నవంబర్ 11 ప్రభాతవార్త :**

శాసన సభలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి నిధులు 9.8 మాత్రమే కేటాయించిందని, ఇది గత బడ్జెట్లతో పోల్చితే చాలా తక్కువగా వున్నాయని, ఈ నిధులు ప్రభుత్వ విద్యా రంగాభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగం పడవని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ విమర్శించారు. గత ప్రభుత్వం పాఠశాల విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, దానిని తిరిగి పునర్మించే పని ఈ ప్రభుత్వం చేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించడం తీవ్ర నిరాశ పరిచిందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి 30 నిధులు తమ బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని చెప్పిన కొఠారి కమీషన్ సిఫార్సుల దరిదాపుల్లో కూడా ఈ బడ్జెట్ కేటాయింపులు రాకపోవడం శోచనీయమని తెలిపారు. నాడు నేడు పనులు నిధులు లేక సగంలో నిలిచిపోవడం వల్ల నూతనంగా నిర్మించిన గదులు నిరుపయోగంగా మారాయని, వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం నిధుల కేటాయింపు ఈ బడ్జెట్లో లేవని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల గురించి, 12వ పిఆర్సికి సంబంధించిన అంశాలు గాని ఈ బడ్జెట్లో ప్రస్తావించక పోవడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం కోసం బడ్జెట్లో నిధులను పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు ఆసక్తిని పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక బకాయిల చెల్లింపులు, 12వ పిఆర్ సి అమలుకు తగు చర్యలు తక్షణం తీసుకోవాలని డిమాండ్ చేసారు. వివిధ రకాల స్కీముల ద్వారా వచ్చే నిధులతో కాకుండా ప్రభుత్వ నిధుల ద్వారానే ప్రభుత్వ విద్యాభివృద్ధికి పూర్తి స్థాయి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని యుటియఫ్ ఆయన కోరుతున్నదని తెలిపారు.

# జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు

## ఆడియో మెట్రేషన్ పరీక్షలు - హియరింగ్ మిషన్లు పంపిణీ

**కడప లీగల్, నవంబరు 11, ప్రభాతవార్త:**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు నగరంలోని రామాంజనేయపురంలో గల హెలెన్ కిల్లర్ ప్రత్యేక పాఠశాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నల్సా వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015, నల్సా మానసిక అనారోగ్యం మరియు మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవలు పథకం 2015 మరియు జాతీయ న్యాయసేవాధికార సంస్థ నల్సా వారి విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయ సేవలు పథకం 2021లను వివరించారు. విభిన్న ప్రతిభా వంతులకు సంబంధించిన శాఖల వారు, వైద్యశాఖ వవారు స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. వైద్యాధికారులతో ఆడియో మెట్రేషన్ టెస్టులు నిర్వహించారు. జడ్జీ 10 మంది ప్రత్యేక పిల్లలకు హియరింగ్ మిషన్స్ అందజేయడం జరిగింది. అనంతరం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పిల్లలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ జడ్జీలు నందిని, ఖాజా మొయినుద్దీన్, అనిల్‌కుమార్ నాయక్, ఆశా ప్రియ, అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏ బుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్ ఆర్‌వీ కృష్ణ కిశోర్, వైద్యాధికారి డా.సునీత, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ తెరపిస్ట్ శ్రీలేఖ, హెలెన్ కెల్లర్ ప్రత్యేక పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీరామాపుర పుణ్యక్షేత్రంలో నేడు ఉత్తర ద్వార దర్శనం

**కమలాపురం, నవంబరు 10, ప్రభాతవార్త:**



కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం కమలాపురం మండలం రామాపురం పుణ్యక్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనానికి విచ్చేసే భక్తులకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కమలాపురం మండలం శ్రీరామాపురం మహాపుణ్యక్షేత్రంలో ఏకాదశి ఉత్తర ద్వార ప్రవేశం చేసి శ్రీ మహాలక్ష్మీ మోక్ష నారాయణ స్వామి వారిని శ్రీవల్లీ దేవసేన దికంద్ర సుబ్రమణ్యస్వామి వారిని, శ్రీ సంజీవిని మౌలిక సహిత వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకుంటే భక్తులకు మహాభాగ్యం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి ఏకాదశి సాయంత్రం గరుడ వాహనంపై మహా శ్రీమహాలక్ష్మీ మోక్ష నారాయణ స్వామి వారిని పురవీధుల్లో ఉత్సవం నిర్వహిస్తారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో అభివృద్ధి పనులు ముమ్మరం

**కలికిరి, నవంబరు 10, ప్రభాతవార్త:**



పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ అభివృద్ధి పనులు ముమ్మరం చేశారు. పంచాయతీలో పల్లెపండగ నిమిత్తం అభివృద్ధి పనులు మంజూరు చేయాలని స్థానిక సర్పంచ్ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే రూ.15లక్షల వ్యయంతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయడం జరిగింది. దీంతో పంచాయతీలోని పాత హరిజనవాడలో రూ.4లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు అలాగే గాదెలబండ కురవపల్లెలో రూ.5 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు, కురవపల్లెలో రూ.4లక్షలతో గ్రామానికి కొత్త రక్షిత మంచినీటి బోరు, పైపులైను నిర్మాణ పనులు, పాత హరిజనవాడలో రూ.6లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులు మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు. దీంతో గాదెలబండ కురవపల్లెలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసనూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలో కొత్త రక్షిత మంచినీటి బోరుతో పాటు పైపులైను ఏర్పాటు పనులు చేపట్టారు. పంచాయతీలోని పాత హరిజనవాడలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు సర్పంచ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్డిరామ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేసి పీలేరు ఎమ్మెల్యే అభివృద్ధి పనులు ప్రారంభించేలా పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవాజుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో భానుమూర్తిరావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

# మంచినీటి పైపులైన్లు ఏర్పాటుతో సమస్య పరిష్కారం

**కలికిరి, నవంబరు 10, ప్రభాతవార్త:**



శీమండలంలోని మర్రికుంటపల్లె రోడ్డులో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి నవాజుల్లాలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో నూతన పైపులైను ఏర్పాటు చేయడంతో గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం అయ్యింది. గ్రామంలో పైపులైను లేకపోవడంతో కొన్ని ఇళ్లకు మంచినీటి సరఫరా లేక సమస్య తలెత్తింది. దీంతో గ్రామస్థులు సర్పంచ్ రెడ్డిరామ్ దృష్టికి తేవడంతో స్పందించిన సర్పంచ్ సమస్యను ఎంపీడీవో భానుమూర్తిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నూతన పైపులైను ఏర్పాటు చేసి మంచినీటి సమస్య పరిష్కరించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# తహసీల్దారుగా మహేశ్వరీభాయ్ బాధ్యతలు స్వీకరణ

**కలికిరి, నవంబరు 10, ప్రభాతవార్త:**



కలికిరి మండలం తహసీల్దారుగా సోమవారం మహేశ్వరీభాయ్ బాధ్యతలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా తహసీల్దారు కుటుంబ సమస్యలతో సెలవులో ఉన్నారు. సోమవారం తిరిగి సెలవు పూర్తి కావడంతో తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ప్రజాదర్బార్ గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు ప్రజలు, రైతుల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించి కొన్ని అప్పటికప్పుడే పరిష్కరించారు. మరిన్నింటిని తన సిబ్బందిని పర్యవేక్షించి త్వరగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సమస్యలపై రైతులకు, ప్రజలకు సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చని దళారులను నమ్మవద్దన్నారు. ఇప్పటికే తహసీల్దారుల కార్యాలయంలో దళారులపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు రెవెన్యూ సమస్యలపై ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైసింగ్‌ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

**కడప క్రైం, నవంబరు 10, ప్రభాతవార్త:**

జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు పోలీసు అధికారులు ఆదేశించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

# ఉచిత గ్యాస్‌కు ఆధార్ లింకు చేసుకోండి

**సిద్దవటం, నవంబరు 11, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలం టక్కోలి ఎస్సీ కాలనీ దీపం పథకం కింద మన సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉచిత గ్యాస్ ఆధార్‌కు ఫోన్ నెంబరుకు లింకు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి నాగమునిరెడ్డి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలందరికీ ఉచితగ్యాస్‌కు అందించేందుకు ఫోన్ నెంబరుకు లింక్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టుమ్యాన్ నరసింహారెడ్డి, కృష్ణయ్య, శశి, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆకుతోట, పెరటి తోటలతో ఆరోగ్యం




**మైదుకూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:**

మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆకుతోట, పెరటి తోటల పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విస్తరణ సంచాలకులు, డాక్టర్ వైయస్సార్ హెచ్ యు,వి.ఆర్ గూడెం, డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ ఆకుతోట, పెరటి తోటల ప్రాముఖ్యత పైన పకృతి వ్యవసాయంలో కూరగాయలు పెంచుకొని తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియజేశారు. దీనివలన ఆహారం మంచిగా ఉపయోగించుకోవాలని, పురుగు మందులు తక్కువగా వినియోగించుకోవాలని తెలియజేశారు. డి ఏ ఎం, ఏపీ సీఎన్ ఎఫ్, ఎస్.వి ప్రవీణ్ కుమార్, పి ఎం డి ఎస్ కిడ్స్, అందివ్వాలని, కెవికె అనుసంధానముతో అన్ని కార్యక్రమాలను తెలియజేయాలని తెలియజేశారు. గోవిందరాజులు చేతుల మీదుగా రైతులకు, మహిళలకు కూరగాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఎస్సీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు కూడా అందించారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి బాలకృష్ణ, పెరటి తోటల పెంపకం పురుగు మందులు వాడకుండా వేప నూనె వంటివి మాత్రం పిచికారి చేయాలన్నారు. అనంతరం విస్తరణ సంచాలకులు కెవికె వారి కార్యచరణలలో భాగంగా చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు మరియు ఇతర విస్తరణ కార్యక్రమాలు చేసినవి పిపిటి రూపంలో వివరించారు. తగు సూచనలు మెరుగు పరుచుకోవడానికి సూచించారు. ఇందులో డాక్టర్ శ్రీ విద్యా రాణి, డాక్టర్ ఎస్ ఫిరోజ్ హుస్సేన్, డాక్టర్ బి ఎన్ కాంతి శ్రీ, మరియు ఏపీ సీఎన్ ఎఫ్ రైతులు, ఎస్సీ రైతులకు టార్పిలిన్ షీట్‌లు కూడా అందించారు.

# జిల్లా యువ ఉత్సవ్ గోడపత్రాల ఆవిష్కరణ

**మైదుకూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:**



జిల్లాస్థాయి యువ ఉత్సవాలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరు ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర మైదుకూరు అధికారి శివశంకర్ మరియు కళాశాల సిబ్బంది విద్యార్థులచే గోడపత్రాలను ఆవిష్కరించారు.భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం కడప నందు నవంబర్ 16వ తేదీన జరిగే యువ ఉస్తావ్ ఇండియా 2047 అనే అంశంపై పెయింటింగ్, కవిత్వము, మొబైల్ ఫోటోగ్రఫీ, డిక్లేమషిన్ విభాగాలలో వ్యక్తిగత పోటీలు మరియు కల్చరల్ ట్రెడిషనల్, ఫోక్, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా పోటీలలో గ్రూప్ మరియు వ్యక్తిగత పోటీలు ఉంటాయని ఈ పోటీలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి, రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి పంపబడును. గెలుపొందిన విజేతలకి ప్రథమ ద్వితీయ తృతీయ నగదు బహుమతులు ఉంటాయి అని కావున మైదుకూరు పట్టణ పరిసర ప్రాంత యువత ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలి అని సూచించారు. మైదుకూరు లో గల వివిధ డిగ్రీ పాలిటెక్నిక్ ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శుభాన్ సాహెబ్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి వి కృష్ణా రెడ్డి అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సిటిఎం చెరువులో విషపదార్థాలు

## లక్షలాది చేపలు మృత్యువాత

**మదనపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త :**



చేపలు నీటిలో తేలియాడుతున్న దృశ్యం

రూరల్ మండలంలోని సిటిఎం పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష పదార్థాలు కలుషితం చేయడం వల్ల లక్షలాది చేపలు మృత్యువాతపడ్డాయి. చెరువులోని నీరు విషతుల్యం కావడాన్ని సోమవారం పశువుల కాపరులు గుర్తించారు. గ్రామంలోని కొందరు కక్షసాధింపుతో చెరువులో విషపదార్థాలు కలపడం వల్లే అధికశాతం చేపలు మృత్యువాతపడి నీటిలో తేలియాడుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువులో విషపదార్థం కలపడం వల్ల పశువులు సైతం అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చెరువులో కలిపిన విషపదార్థాలపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

# వెలుగు ప్రత్యేక పాఠశాలలో అన్నదానం

**మదనపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త :**



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కుమార్తె బెంగుళూరు కొలంబియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీమతి అరవిందారెడ్డి పుట్టినరోజు సందర్భంగా వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో రెండుపూటల అన్నదానం నిర్వహించారు. కేక్‌కట్‌చేసి వృద్ధులకు, చిన్నారులకు పంచిపెట్టారు. వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి మేనకోడలు పుట్టినరోజు సందర్భంగా సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైటి.ఉషారాణి, వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

## సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



**మదనపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడతూ బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిని కీర్తించడం, గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంశాన్ని వర్ణించడానికే మంత్రి ప్రసంగం సరిపోయిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు పెండింగ్‌లోని వేతనం పెంపు, సమ్మెకాలపు హామీల గురించి ప్రస్తావించకపోవడం ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ పెన్షన్లుపెంపు, ఉచిత గ్యాస్ గురించి ఘనంగా చెప్పిన మంత్రి ఉచిత బస్సు ప్రయాణం గురించి త్వరలో ప్రారంభిస్తామని చెప్పారే తప్పా అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.

# తవళం శివాలయంలో దీపాలతో మహిళలు

**నిమ్మనపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలం తవళం అటవీప్రాంతంలోని శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా రెండవ సోమవారం ఘనంగా మహిళలు దీపాలు వెలిగించి శివపార్వతులకు మొక్కుకొన్నారు. ఈ కార్తీకమాసం సందర్భంగా ఈనెల 15న కార్తీకపౌర్ణమి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని దేవాలయన తాత్కాలిక ఛైర్మెన్ రామక్రిష్ణ, సర్పంచ్ రెడ్డప్ప, దేవాలయ నిత్యన్నదానకర్త సిఎం రెడ్డప్పరెడ్డి నేడొక ప్రకటనలో తెలిపారు. కుంభాభిషేకం, పౌర్ణమికి మదనపల్లె-నిమ్మనపల్లెకు ఆర్టీసి బస్సులు నడుస్తాయన్నారు.

## ఉన్నత ప్రమాణాలతో అత్యున్నత విద్య



ప్రొద్దుటూరు అర్బన్ నవంబర్ 11 ప్రభాతవార్త:
ఉన్నత ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న ఎడిఫై పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్యాను అందించాలని మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొర్రపాడు రోడ్డులోని ఆదిత్యారామ్ కాంప్లెక్స్లో పాఠశాల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడానికి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కామసూరులో పాఠశాలను ఏర్పాటు చేయడం వల్ల తమ గ్రామానికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎడిఫై పాఠశాల పాఠ్యప్రణాళిక అద్భుతమని అందువల్లనే ఆ పాఠశాలను ఈ ప్రాంత వాసుల కోసం ప్రొద్దుటూరులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఈ పాఠశాలకు 250 బ్రాంచీలు ఉన్నాయని తెలిపారు. విద్యబోధనలో వారి పనితీరు రాజీలేని విధంగా ఉంటుదన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నైతిక విలువలు అలవరచుకునే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇతర ప్రాంత విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చేవిధంగా ఉన్నత ప్రమాణాలతో పాఠశాలను నిర్వహిస్తామన్నారు. 13 ఎకరాల విశాల మైదానంలో రెసిడెన్సియల్ క్యాంపస్, ఎసీ క్యాంపస్ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు ఏకే. అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాలను నెలకొల్పామని తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులు ఆల్రౌండ్ డెవలప్మెంట్ సాదించేవిధంగా తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీవన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, మదనపల్లి ఎడిఫై పాఠశాల కరస్పాండెంట్ రమేష్ వివిధ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మోలానా అబుల్ కలాం 137 వ జయంతి



ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 11 ప్రభాతవార్త :
కడప జిల్లా కలెక్టర్ శివ శంకర్ స్ఫూర్తితో ప్రొద్దుటూరు 33 వార్డులో మోలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం రోజి వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఎస్వివి గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున రావు, 24,33 వార్డు కౌన్సిలర్లు కమల్, గాజుల శివ జ్యోతి, టిఎన్టీయూసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్, విద్యా కమిటీ చైర్మన్ ఆలీ భాషా, డెంటల్ డాక్టర్ సుజాత పాల్గొని ఉచితంగా పిల్లలకు దంతాలను పరీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ పిల్లలు ఉద్దేశించి మాట్లాడుతూ వారిలో దేశభక్తి దేశ కీర్తి గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీచర్లు సొసైటీ సభ్యులు జహీరుద్దీన్,హుస్సేన్ సాహెబ్, దేశం రెడ్డి, ఖాదర్ వలీ, డీజే షఫీ, షాకీర్, గాజుల రవికుమార్ ,అంజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి మొదటి బహుమతిగా గడియారము, రెండో బహుమతిగా అట్లాస్ ఇచ్చి సొసైటీ తరపున విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు.

## మొదటి విద్యాశాఖ మంత్రి జన్మదినమే..
## జాతీయ విద్యాదినోత్సవం



సుండపల్లి, నవంబర్11, ప్రభాతవార్త :
మండలంలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల నందు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మోలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినమైన నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని. తిమ్మసముద్రం పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యులు ఆరిఫుల్లా మాట్లాడుతూ అబుల్ కలాం భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఈ ఏడాది మోలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతిని మనం జరుపుకుంటున్నాం అన్నారు. విద్యా విధానంలో కొత్త పోకడలు సృష్టించి దేశాభివృద్ధికి దారులు వేసిన ఆ మహానుభావుడి జన్మదినమైన నవంబరు 11ను జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నాం అన్నారు. 1958 ఫిబ్రవరి 22న మోలానా అబుల్ కలాం ఆజాద్ తుదిశ్వాస విడిచారు అని ఇటువంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయురాలు కలీమున్నిసా విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉపాద్యాయులు సబీహా ఖానం, ఖతీబుద్దీన్, సలీం, కలిమున్నిసా, వెంకట్‌రెడ్డి, గౌసియబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూత్ ఫెస్టివల్‌లో శ్రీ జ్ఞానాంబిక విద్యార్థుల

మదనపల్లి క్రైమ్ నవంబర్ 11 ప్రభాతవార్త.



శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ డిగ్రీ కళాశాల యూత్ ఫెస్టివల్ పోటీల్లో శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు కరస్పండాడు గురు ప్రసాద్ తెలిపారు. యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో జ్ఞానాంబిక విద్యార్థులు చేసిన జానపద గ్రూప్ డాన్స్ లో బంజారా నృత్యానికి మొదటి స్థానాన్ని, వెస్ట్రన్ సోలో మూడవ స్థానాన్ని, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్ లో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థినులు ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ నిర్వహించు సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్ లో పాల్గొనడానికి అర్హత సాదించారు. వీరిని కళాశాల కరెస్పాండంట్ ఆర్ గురు ప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు.

## ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి

మదనపల్లి క్రైమ్ నవంబర్ 11 ప్రభాతవార్త.
ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మదనపల్లిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇస్తా ఉన్నాయి. మదనపల్లి పట్టణం పెంచుపాడు రోడ్డులోని ఆర్‌వి నాయుడు వీదికి చెందిన రెడ్డప్ప భార్య భూదేవి (45 ) గత నెల 31వ తేదీ ఆర్థిక సమస్యలు తాళలేక ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న భూదేవి సోమవారం ఉదయం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మైనార్టీల్లో విద్యాచైతన్యం రావాలి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



అవార్డు అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త :
మైనార్టీల్లో విద్యాచైతన్యం రావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం విజయవాడలోని తుమ్మావారి కళాక్షేత్రంలో జరిగిన మైనార్టీల సంక్షేమ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల్లో అక్షరాస్యత శాతం తక్కువుగా ఉందని ప్రతి మైనార్టీ విద్యార్థి చదువులో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. విద్యవల్ల భవిష్యత్తులో జరిగే లాభాల గురించి వివరించారు. మైనార్టీలు విద్యలో రాణించినపుడే రాజకీయంగా కూడా రాణించవచ్చునన్నారు. అనంతరం ఉర్దూ పాఠశాలలు, భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి వివిధ విభాగాల్లో అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు నసీర్అహ్మద్, శ్రీనివాసరావు, మైనార్టీ వ్యవహారాల సలహాదారులు ఎం.ఎ.షరీఫ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మెన్ మౌలానా ముస్తాక్అహ్మద్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూక్, వివిధ జిల్లాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కులగణన చేపట్టండి

వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్



సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త :
రాష్ట్రంలో కులగణన చేపట్టి, కుల జనాభాను అధికారికంగా ప్రకటించాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పిఆర్‌జిఎస్ కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో వాల్మీకి బోయలకు టిడిపి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వాల్మీకి బోయలకు ఇచ్చిన హామీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు వాల్మీకి భోయల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వాలు మారినా వాల్మీకుల తలరాతలు నేటికి మారలేదన్నారు. వాల్మీకి బోయలను గిరిజన జాబితాలోకి పునరుద్దరణ చేయడానికి 2017లో నాటి టిడిపి ప్రభుత్వం అసెంబ్లీ తీర్మాణం చేసిందన్నారు. 2023లో వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మాణాలు నేటికి అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాల్మీకులను గిరిజనులుగా గుర్తిస్తామని, వాల్మీకి జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీలు నేటికి నెరవేరలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వాల్మీకి బోయల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూలకుంట్ల హరి, విజయమోహన్, బాబు, నాగరాజు, మల్లికార్జున, రెడ్డప్ప పాల్గొన్నారు.

## విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం




ఖాజీపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:
ఖాజీపేట మండలంలోని అప్పన్నపల్లి గ్రామంలో పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో విధ్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల ఎంఈఓ నాగ స్వర్ణలత హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని విధ్యార్థులందరు ఇష్టంతో కష్టపడి వృద్ధిలోకి రావాలని అన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యని అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ విధ్యార్థుల అభ్యున్నతి కోసం పద్మ మహిళ మండలి వారు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పద్మ మహిళా మండలి అధ్యక్షురాలు చిన్న అమ్ములు మాట్లాడుతూ విధ్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ, పట్టుదలను అవలంభించుకొని ఉన్నత స్థాయి ఎదగాలని కోరారు. తదనంతరం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 60మంది విధ్యార్థులకు పద్మ మహిళా మండలి అధ్యక్షురాలు చిన్న అమ్ములు ఎంఈఓ చేతులమీదుగా ఎగ్జామినేషన్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్య నాగరాజు, ప్రధాన ఉపాధ్యాయుడు రవిబాబు, పద్మ మహిళా మండలి ముఖ్య సలహాదారులు జూలియన్ రాజు, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, రహీమాన్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పుల్లంపేటలో ఘనంగా కార్తీక సోమవారం

పుల్లంపేట, నవంబర్ 11 ప్రభాతవార్త:
పుల్లంపేట మండల కేంద్రంలోని శ్రీ పర్వత వర్దని శాంతి లింగేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఘనంగా రెండవ సోమవారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుండే రాత్రి 9 గంటల వరకు భక్తులు దేవస్థానం నందు విరివిగా పాల్గొని కార్తీక దీపాలను వెలిగించడం జరిగింది. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించడం జరిగింది. భక్తులు వారివారి మొక్కుబడుల మేరకు స్వామివారికి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులతో నిర్వహించిన అడుగు భజన కార్యక్రమం భక్తులను ఆకర్షించింది. కార్యనిర్వాహకులు దేవరకొండ నరశింహులు ఉదయం నుండి దేవస్థానం వద్దే ఉండి భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో పుల్లంపేట మండలం నుండే కాకుండా ఓబుల వారిపల్లె మండలం నుండి కూడా భక్తులు శివాలయంకు చేరుకొని స్వామి వార్తను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ప్రజా నాయకుడు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



కాశినాయన ,నవంబర్11 (ప్రభాతవార్త):
నాయకుడంటే ప్రజల కష్టాల పాలు పంచుకోవాలి. సమస్య ఉందంటే పరిష్కరించాలి. అటువంటి నాయకుడినే ప్రజలు ఆదరిస్తారు, అభిమానిస్తారు, అయితే నేటి రోజులలో అలాంటి నాయకులు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఒకరు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తక్షణమే ఆ సమస్యను పరిష్కరించేలా ఆయన చర్యలు తీసుకుంటారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి గత 10 రోజుల క్రితం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలోని దమ్మనపల్లె ఎస్సీ కాలనీనీటి సమస్య ఉందని గ్రామస్థులు తెలియజేయగా ఈ సమస్య పరిష్కరించాలంటూ స్థానికులు ఎమ్మెల్సీని కోరారు. దీంతో వైస్ ఎంపీపీ బాషతో మాట్లాడారు. స్థానికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నీళ్లకు అయితేస్థానికులు పడుతున్న కష్టాలను సమస్య తీవ్రతను చెప్పారు. మండల నిధుల ద్వారా నేటి సమస్యను పరిష్కరించాలని బాషను ఆదేశించడం జరిగింది. ఆయన దగ్గరుండి ప్రతి ఇంటికి నీళ్ల సరఫరా అయ్యేలా మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నేటి సమస్యలు పూర్తి చేశారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ప్రతి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి ప్రతి ఇంటికి నీల్లను విడుదల చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాలనీవాసులు రెండు కరెంటు స్థంభాలు కావాలని విన్నవించుకోవడం జరిగింది. అలాగే వారికి వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సి.బాష, రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు గుర్రప్ప, ఇషాక్, వెంకటేశ్వర్లు, మాపీర, ఉపసర్పంచ్ రుద్రవరం ప్రసాద్ చిత్తా గిరి ప్రణీత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మోటారు చోరీకి యత్నించిన దొంగను పట్టుకున్న రైతులు

గోపవరం, నవంబర్11 (ప్రభాతవార్త):



మండలంలోని పెద్ద గోపవరం గ్రామ సమీపంలోని పొలంలో మోటారు దొంగిలించేందుకు యత్నించిన దొంగని సోమవరం రైతులు పట్టుకున్నారు. గత కొద్ది రోజులుగా గ్రామ సమీపంలోని పొలాలలోని ట్రాన్స్ఫార్మర్‌లో ఆయిల్ మరియు విద్యుత్ వైర్లు బోరు మోటార్లు మాయమవుతున్నాయి. అలాగే పెండెం ఎస్టేట్ వెంచర్‌లో దాదాపు ఆరు ట్రాన్స్ఫార్మర్ లోపల ఉన్నటువంటి వందల లీటర్ల ఆయిల్ కూడా దొంగలించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం పట్టపగలే మోటారు దొంగలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు వ్యక్తులు పరార్ అయినట్లు తెలిపారు.

## వైసిపి బీసీ కమిటీలపై జగన్‌తో చర్చించిన ఎమ్మెల్సీ

ప్రొద్దుటూరు నవంబర్ 11 ప్రభాతవార్త :



రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీలను బలోపేతం చేసే క్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని వైసీపీ రాష్ట్ర బీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కలిసి బీసీ కమిటీలో ఏర్పాటుపై చర్చించారు. సోమవారం తాడెపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్రెడ్డిని కలిశారు. ఎమ్మెల్సీ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పర్యటించనున్నట్లు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. బీసీల సమస్యలపై అధ్యయనం చేస్తానని ఆయనకు వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులతో కలిసి సమన్వయంగా బీసీ కమిటీలను ఏవిధంగా ఏర్పాటు చేసేది ఆయనతో చర్చించానన్నారు.

## మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం



బద్వేలు అర్బన్, నవంబర్ 11 (ప్రభాతవార్త) :
మెప్మాసిబ్బందితో సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మెప్మా సి.వోలు, ఆర్‌పీలను ద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సంఘాలను, సంఘ సభ్యులను యాప్‌లో నమోదు చేసేటపుడు ఖచ్చితత్వంతో కూడిన వివరాలు నమోదు చేయాలన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేయుటకు మెప్మారీసోర్స్ పర్సన్‌లకు సంఘ సభ్యులకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో ఏదైనా వ్యాపారాలు చేస్తుంటే సంబంధిత ఫోటోలు అందించి వివరాలు నమోదు చేసేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు రీజనల్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ తారాశంకర్, సీఎంఎం గోపినాథ్, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తి తమ ఖాతాకు ఆధార్‌ను జత చేయాలి

గోపవరం, నవంబర్ 11 (ప్రభాతవార్త) :
ప్రభుత్వ ప్రవేశపెట్టే వివిధ పథకాలను ప్రజలకు నేరుగా అందాలంటే వారి బ్యాంక్ ఖాతాలకు ఆదార్‌ను తప్పనిసరిగా జత చేయాలని, అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి బ్యాంక్ లేదా పోస్టాఫీసు ఖాతా కలిగి ఉండాలని ఎంపీడీవో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంక్ లేదా పోస్టాపీసు ఖాతాలేని లబ్ధిఆరులను కొంతమందిని గుర్తించి వారికి గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా బ్యాంక్ లేదా పోస్టాపీసు నందు ఖాతాను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ నెల 14 నుంచి ఈ కార్యక్రమం అమలు కానున్నందున ఖాతా అవసరమైన వ్యక్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## శ్రీసాయి ఇంజనీరింగ్ కాలేజీలో
## జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

రాయచోటి, నవంబరు 11, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం భారతదేశపు మొట్టమొదటి విద్యాశాఖామంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత స్వర్గీయ శ్రీ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిరు. ఆయన గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.వి.బాలాజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ముక్కంటి మల్లేశ్వర స్వామికి కార్తీక పూజలు, అభిషేకం

మైదుకూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:



శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యగారి పల్లె దగ్గర ఉన్న ముక్కొండలో నెలకొన్న శ్రీ శ్రీ శ్రీ ముక్కంటి మల్లేశ్వరాలయం నందు వెలసిన ముక్కంటి మల్లేశ్వర స్వామి రెండవ కార్తీక సోమవారం నాడు పూజారులతో పూజలు అభిషేకం నిర్వహించడం జరిగింది. ముక్కంటి మల్లేశ్వర స్వామికి చాలా ప్రాముఖ్యత కూడా బ్రహ్మంగారు కాలజ్ఞానంలో కొన్ని వాక్యాలు రాస్తూనే జరగబోయే నిజాల గురించి చెప్పడం జరిగింది. అంత ప్రాముఖ్యత ఉన్న ముక్కంటి మల్లేశ్వర స్వామికి పెద్ద ఎత్తున కార్తీకమాసంలో భక్తులు దర్శించుకుంటారు. కార్తీక మాసం రెండవ సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గాలివీడు, నవంబర్ 11(ప్రభాతవార్త):



గండిమడుగు శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే మూలవిరాట్‌మూర్తికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పరమేశ్వరుడికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కుషావతీ నదీతీరాన పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. హరహర మహదేవ అంటూ శివనామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ నెల 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాణగణంలో భక్తులకు అన్నప్రసాదాల వితరణ కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు, పుల్లారెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, యోగాంజులరెడ్డి, ఉమాశంకర్, చంద్రాయుడు, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

## రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికైన గాలివీడు విద్యార్థి

గాలివీడు, నవంబర్ 11(ప్రభాతవార్త):



రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి చీకటి జస్వంత్ ఎంపికైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గాలివీడు మండలం కరిమిరెడ్డిగారిపల్లెకు చ ఎందిన వీఆర్ఏ కుమార్ కుమారుడు జస్వంత్ కడప చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ ఛాంపియన్‌షిప్ వాలీబాల్ క్రీడలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికకావడం పట్ల తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అన్యుల వాహనాన్ని వినియోగిస్తూ ప్రమాదానికి గురైతే...

(వారసులకు పరిహారం రాదు-గౌహతి హైకోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, నవంబరు 11 ప్రభాతవార్త :
ఇతరుల యొక్క వాహనం నడుపుతూ ప్రమాదంలో మరణించిన వ్యక్తి చట్టబద్ధ వారసులు మోటారు వాహన చట్టం సెక్షన్ 163ఎ క్రింద పరిహారాన్ని క్లెయిం చేయదాలరని గౌహతి హైకోర్టు స్పష్టం చేసింది. అలా మరణించిన వ్యక్తి వారసులకు పరిహారంగా పైకం మంజూరు చేస్తూ మోటారు వాహన ప్రమాద క్లెయిం ట్రిబ్యునల్ వెలువరించిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. వేతనం పొందుతూ డ్రైవర్‌గా పనిచేసే వ్యక్తి తప్ప మరొకరు ఇతరుల వాహనాన్ని నడుపుతూ వుంటే సదరు వాహనాన్ని వాడే వ్యక్తి మొదటి పార్టీ క్రిందికే తప్ప థర్డ్ పార్టీ క్రిందకు రారని, అందువల్ల ఇతరుల వాహనాన్ని తీసుకొని వాడుతూ ప్రమాదానికి గురైతే అలాంటి వారి వారసులు పరిహారాన్ని క్లెయిం చేయదాలరని గౌహతి హైకోర్టు తీర్పును ఓ కేసులో వెలవరించింది. (నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఎదిరి జోయదాస్ అండ్ అదర్స్ కేసు నెం.ఎంఎసి ఎపిపి/170/2011)

## ఘనంగా పొలతలలో కార్తీక మాసం..



పెండ్లిమర్రి, నవంబరు 10, ప్రభాతవార్త:
శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం కార్తీక మాసం పండగ వారోత్సవాల సందర్భంగా 2వ సోమవారం కావడంతో తెల్లవారు జామునుంచే భక్తులు క్యూలైన్‌లో ఎలాంటి సౌకర్యం కలగకుండా తాగునీరు ఏర్పాటు దర్శనం అనంతరం లడ్డు ప్రసాదం పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎం.కృష్ణనాయక్, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, బాల రాజారెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు నెంబర్ చంద్రశేఖర్, మరియు ఆలయ పూజారులు, ఆలయ సిబ్బంది భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎస్సార్ఐటీలో నేషనల్ ఎడ్యుకేషన్ డే

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 11, ప్రభాతవార్త:



సాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాడు జాతీయ విద్యా దినోత్సవం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఇన్సిటిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించబడిందని ప్రిన్సిపాల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సంధర్భంగా ఈసీఈ హెచ్ఓడి డా.శివ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ చాలా ముఖ్యమైనదని దాని వలన గౌరవం లభిస్తుందని అని అన్నారు. హెచ్అండ్ఎస్ హెచ్ఓడి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సుధామూర్తి ఆశయాలకు మరియు మౌలానా అబుల్ కలాం స్ఫూర్తిని వివరిస్తూ విద్య యొక్క విలువలను, తల్లితండ్రులు ఇప్పటి పరిస్థితిలో విద్యకు చాలా ప్రాముఖ్యతను ఇస్తారని మరియు లైబ్రరీ ద్వారా కూడ చాలా విశయాలు పంపించవచ్చు అని అన్నారు. ఈ సంధర్భంగా సీఎస్ఈ, ఈసీఈ విధ్యార్థులు విద్యను గురించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సంధర్భంగా చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ వెంకటేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమం ద్వారా విద్య యొక్క విలువలను గ్రహించాలని కోరారు.

## ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

రాజంపేట,నవంబర్ 11,ప్రభాత వార్త :



రాజంపేట మండలం, ఊటుకూరు గ్రామంలో యువతి ఆత్యహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఈ సంఘటనలో పూనం నవ్య (24) యువతి వాళ్ల నాన్నమ్మ సంరక్షణలో ఉంది. మృతురాలు తల్లి జీవనోపాదికై కువైట్ వెళ్లింది. మృతురాలు తండ్రి అనారోగ్యంతో ఉండి ఇటీవల మృతి చెందాడు. కువైట్ లో ఉన్న తల్లి ఇటీవల ఇండియాకు వచ్చి నవ్యకు పెళ్లి సంబంధాలు చూస్తోందని అయితే ఆమె ప్రేమించిన వ్యక్తి నిరాకరించడంతో తల్లి చేసే పెళ్లి సంబంధాలు ఇష్టంలేక ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు మన్నారు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.